క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ,గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి, మహా త్రిపుర సుందరి మానస లింగేశ్వర స్వామి వారికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు ఉదయన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించి అలంకరించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

దొర్నిపాడు: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలతో పాటు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ సరళమ్మ, కీటక శాస్త్ర నిపుణుడు శివరామకృష్ణ సూచించారు. శనివారం మండలకేంద్రం దొర్నిపాడులో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దొర్నిపాడు ప్రాంతంలో పత్తి పంటను అధికంగా సాగు చేస్తున్నందున పంటలో వచ్చే గులాబీ రంగు పురుగుతో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. మట్టినమూనాల ఆధారంగా రసాయన ఎరువులను వినియోగించాలని తెలిపారు. ఏఓ సునీత పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): జీవో నంబర్ 1 నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య నాయకులు కుమార్, మధుకిరణ్ డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ సుధాకర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పలు ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి పాఠ్యపుస్తకాల వ్యాపారానికి తెరలేపారన్నారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ప్రారంభం


ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక నందిపైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను నంది గ్రూప్స్ సంస్థల అధినేత సుజల ప్రారంభించారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వంశీధర్ మాట్లాడుతూ అండర్–11, 13 విభాగాల్లో 15 సంవత్సరాల బాలబాలికలు సింగిల్స్, డబుల్స్ విభాగంలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శేషిరెడ్డి, సంజీవరెడ్డి, కోచ్ నాగార్జున పాల్గొన్నారు.

'మొబైల్ నెట్‌వర్క్ కంపెనీలకు మోదీ గిఫ్ట్'

నంద్యాల(న్యూటౌన్): మొబైల్ నెట్ వర్క్ కంపెనీలకు రీచార్జ్‌లు పెంచుకోవాలని మోదీ ప్రభుత్వం నజరానా ఇచ్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, పట్టణ కార్యదర్శి పుల్లానరసింహులు పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ టెక్నాలజీ పేరుతో ప్రజలపై భారం మోపడాన్ని సీపీఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. పెంచిన సెల్‌ఫోన్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. బీఎస్ఎన్ఎల్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసి ప్రైవేటు కంపెనీలకు లాభాలు చేకూర్చేలా బీజేపీ ప్రభుత్వం పదేళ్లగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

నాణ్యంగా బోధించండి


శిథిలమైన వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న డీఈఓ, అధికారులు

గోస్పాడు: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని యాళ్లూరు హైస్కూల్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకును వీలైనంత త్వరగా పడగొట్టాలని సూచించారు. పాఠశాలలో ఐదు సెక్షన్లకు అదనంగా ఐఎఫ్‌పీలను మంజూరు చేస్తామని చెప్పారు. నాడు–నేడు కింద అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. పాఠశాల మైదానంలో ఉన్న బాస్కెట్‌బాల్ కోర్టును సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చక్కగా ఆడుకునేలా చూడాలన్నారు. జిల్లా అలెస్కో కో ఆర్డినేటర్ రఘురామిరెడ్డి, హెచ్‌ఎం శివనాగేంద్ర ఉన్నారు.

నిలువెల్లా విషం

- విషపూరితం.. వయ్యారిభామ మొక్క
- వీటితో రైతులకు అనేక నష్టాలు
- పంటలకు ప్రధాన శత్రువు
- సమస్యాత్మక కలుపు మొక్కగా పేరు
- మనుషులు, జంతువులకూ ప్రమాదకారి
- సామూహిక నిర్మూలనే మార్గమంటున్న నిపుణులు

పేరు అందంగా ఉంటుంది.. మొక్క రూపం కూడా వయ్యారంగానే ఉంటుంది.. కానీ అది చేసే నష్టం అపారం. ఇదంతా వ్యయారిభామ మొక్క గురించే. ఈ మొక్క నిలువెల్లా విష తుల్యమే.. పంటలకు ప్రధాన శత్రువుగా వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. పొలం గట్ల వెంబడి, కాల్వల పొడవునా, రోడ్ల పక్కన ఎక్కడైనా విస్తారంగా పెరిగే కలుపుమొక్క. ఇది పంటలకే కాదు.. మనుషులు, జంతువులకు ముప్పును వాటిల్లజేస్తుంది. వీటిని పొలాల్లో పెరగనిస్తే పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదముందని, చివరకు గడ్డిని కూడా పెరగనివ్వదు. రైతులు సామూహికంగా తొలగిస్తే తప్ప దాని నుంచి నష్టాలను తప్పించుకోలేరని అధికారులు చెబుతున్నారు.

గోస్పాడు: సమస్యాత్మక కలుపు మొక్కగా మారిన వయ్యారిభామ విస్తారంగా వ్యాపించి రైతులను పట్టి పీడిస్తోంది. హానికరమైన కలుపు మొక్క. దీని శాస్త్రీయం నామం..పార్థీనియం హిస్టారోఫోరెస్. దీన్ని స్థానికంగా..కాంగ్రెస్, నక్షత్ర గడ్డ, మంగమ్మ చెట్టు అని కూడా పిలుస్తారు. ఈ కలుపు మొక్కలను సామూహికంగా నిర్మూలించకపోతే రైతులకు తీరని నష్టం చేకూరుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. చూడడానికి అందంగా కనిపించే ఈ మొక్కలను వదిలేస్తే ఎన్నో సమస్యలు తప్పవు.

త్వరగా పూతకొస్తుంది..

ఈ మొక్క సుమారు రెండు మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. దీని ఆకులు చీలికలతో కూడి సన్నటి నూగులాంటి రోమాల మాదిరిగా పెరుగుతాయి. మొలకెత్తిన నాలుగు నుంచి ఆరు వారాల్లోనే పూత దశకు వస్తుంది. ఒక్కో మొక్క పలు విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. గాలి,నీరు, పశువులు, మనుషులు, వ్యవసాయ పనిముట్లు ద్వారా సులువుగా వ్యాపిస్తాయి. మొక్కలోని అన్ని భాగాల్లో విష పదార్థం ఉంటుంది. ఈ విషం వల్ల మానవాళికి, పశువులకు వివిధ రకాల జబ్బులు వస్తాయి. ముఖ్యంగా పంట పొలాలు, బంజరు భూములు, ఆటవీ ప్రాంతాలు, రహదారుల పక్కన ఇవి విస్తారంగా వ్యాపిస్తాయి.

సమగ్ర నివారణ పద్ధతులు అవసరం...

ఈ మొక్కలను నిర్మూలించడానికి మండల వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి పలు నివారణ చర్యలను సూచించారు. గ్రామాల్లో రైతులందరూ తమ పొలాల్లో సామూహికంగా నిర్మూలన చర్యలు చేపట్టాలి. పూత రాక ముందే ఈ మొక్కలను వేర్లతో సహా పీకి తగలబెట్టాలి. ఆపై ఎక్కడైనా మొక్కలు మొలిస్తే వెంటనే వాటిని కూడా వేర్లతో సహా పెకలించాలి. నిలా నాలుగైదు సంవత్సరాలు చేస్తే వీటిని పూర్తిగా నివారించవచ్చు.


వయ్యారిభామ మొక్క

- వేసవిలో పొలాలను లోతుగా దుక్కి చేయడంతో కలుపు విత్తనాలు కూడా లోతుకు పోయి మొలకెత్తవు. తద్వారా ఈ మొక్కల ఉత్పత్తి తగ్గుతుంది.
- నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న పొలాల్లో బంతి పంట మార్పిడి సాగు ద్వారా కూడా కలుపును నివారించవచ్చు.
- కీటకాలు ఈ మొక్కల ఆకుల కాండాన్ని తినడం ద్వారా సమర్థవంతంగా నివారించవచ్చు. పొలంలో ఈ మొక్కల తీవ్రతను అనుసరించి పలు రకాల కీటకాలను వదలడం ద్వారా వాటి సంతతి కూడా వృద్ధి చెందుతూ పెద్ద, చిన్న కీటకాలు ఈ మొక్కలను సమగ్రంగా అరగిస్తాయి.
- పైరు సాగు చేయని పొలాల్లో ఉప్పు ద్రావణాన్ని 15 లేదా 20 శాతం (లీటరు నీటికి 150 లేదా 200 గ్రా) పూతకు రాకముందే కలుపు మొక్కలపై పిచికారీ చేయడం ద్వారా వీటి ఉధృతిని తగ్గించవచ్చు..


పొలాల్లో పెరిగిన వయ్యారిభామ మొక్కలు

అనర్థాలు అనేకం..

- ఈ మొక్క పుప్పొడి దాదాపు 100 కి.మీ. దూరం ప్రయాణం చేస్తుందట.
- మన ప్రాంతంలో వయ్యారి భామగా పిలిచే ఈ మొక్కల పుప్పొడితో మనుషుల్లో శ్వాసకోశ సంబంధ వ్యాధులు (ఆస్తమా) చర్మ వ్యాధులు. విష జ్వరాలు వస్తాయి.
- మనుషులకు తీవ్రమైన ఊపిరితిత్తులు ఇన్ఫెక్షన్‌కు గురవుతారు. జ్వరం, అతిసారం, చర్మం మంట, బ్రాంకైటీస్, కనురెప్పల వాపు, కళ్లు ఎర్రగా మారడం వంటి సమస్యలు వస్తాయి.
- ముఖ్యంగా శీతాకాలంలో ఈమొక్క ప్రభావం మనుషులపై అధికంగా ఉంటుంది.
- పశువులకు కూడా ఊపిరితిత్తుల వ్యాధులు, జ్వరాలు, చర్మవ్యాధులు సోకుతాయి. పశువులు ఈ మొక్కలను ఆహారంగా తీసుకున్నప్పుడు చర్మ సంబంధమైన వ్యాధులు కలగడమే కాకుండా పాల ఉత్పత్తి తగ్గి బరువు కూడా కోల్పోతాయి.
- ఈ మొక్కలు ఒక రకమైన రసాయనాన్ని వేర్ల ద్వారా ప్రవించి ఇతర మొక్కలను మొలకెత్తకుండా నిరోధిస్తాయి. ఇవి ఉన్న చోట వేరొక మొక్కలు బతకవు.
- పచ్చిక మైదానాలలో గడ్డి రాకుండా, ఎదగకుండా చేస్తాయి. ఈ కారణంగా పశుగ్రాసం కొరతకు కారణమవుతాయి.

ఖరీఫ్ పంటలపై దృష్టి సారించండి

ఉయ్యాలవాడ : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది, క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులు సాగు చేసే పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయ సహాయకులకు మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సీజన్‌లో రైతుల నుంచి 486 మట్టి నమూనాలు, 1,575 మంది రైతులకు కౌలు కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఆయా గ్రామాల్లో భూయజమానుల నుంచి కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసే రైతులను గుర్తించాలని ఆదేశించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ అభయాంజనేయస్వామి, లక్ష్మీవేంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామికి అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ జరిపించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

వేలంలో తగ్గిన ఆదాయం

నంద్యాల(అర్బన్): కొత్తపల్లె గ్రామంలో వెలసిన శ్రీరామస్వామి దేవాలయానికి చెందిన 16 ఎకరాల మాన్యం కౌలుకు శనివారం నిర్వహించిన వేలం పాటల్లో గత ఏడాది కంటే రూ.94వేల ఆదాయం తగ్గింది. అధికారుల ఉదాసీన వైఖరి, పాటదారులు వేలంలో కుమ్మక్కు కావడంతోనే ఆదాయం తగ్గింది. ఈఓ. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఆలయ ఆవరణలో బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహించారు. గతేడాది 16ఎకరాలకు రూ.4,31,500 పలుకాగా, ప్రస్తుతం రూ.3.36 లక్షలు మాత్రమే లభించింది. పాటదారుడు ఒకరైతే కౌలుదారులు మరొకరుగా పాట నిర్వహించడం, పాటను ఒకేసారి ముగించడం వంటి వాటితో పాటదారులు పోటీ పడే అవకాశం లేకుండా పోయింది.

సత్వర న్యాయం కోసమే లోక్ అదాలత్


కేసులు పరిష్కరిస్తున్న ఐదవ అదనపు జిల్లా జడ్జి

ఆళ్లగడ్డ: కక్షిదారులకు సత్వర న్యాయం అందించడానికి లోక్ అదాలత్ సరైన వేదిక అని జిల్లా ఐదవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవ సంఘం అధ్యక్షులు మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక కోర్టు భవనంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి పలు కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 77 కేసులు పరిష్కరించామని..ఇందులో ఐపీసీ – సీసీ 40, ఎంసీ 1, క్రిమినల్ అప్పీల్ 2, మోటర్ ఆక్సిడెంట్ కేసులు 14, ప్రోనోట్ కేసులు, సూట్స్ 9 కేసులు పరిష్కరించామని చెప్పారు. ఈపీ కేసులకు సంబంధించి రూ.1,27,38,530, యాక్సిడెంట్ కేసులకు సంబంధించి రూ.1,05,50000, ప్రోనోట్‌కు సంబంధించి రూ.17,00,000 నష్టపరిహారం కింద కక్షిదారులకు ఇప్పించామని వివరించారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించే కేసులకు అప్పీలు ఉండదని పేర్కొన్నారు.

ఈవీఎంల గోడౌన్ల తనిఖీ

నంద్యాల(అర్బన్): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికలకు వినియోగించిన వీవీ ప్యాడ్‌లకు పేపర్ రోల్, అడ్రస్ ట్యాగులను విడగొట్టే ప్రక్రియను ప్రారంభించామని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం టెక్కె మార్కెట్ యార్డులోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్లను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికలకు వినియోగించిన వీవీ ప్యాడ్లకు, అడ్రస్ ట్యాగులు పేపర్ రోల్‌ను తొలగించే కార్యక్రమం చేపట్టామన్నారు. డీఆర్‌ఓ పద్మజ, డ్వామా పీడీ, వీవీప్యాట్‌ల నోడల్ అధికారి రామచంద్రారెడ్డి, అన్ని పార్టీల రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.


కలెక్టర్ ఆధ్వర్యంలో గోడౌన్‌ను తెరుస్తున్న దృశ్యం

విత్తన ప్రాసెసింగ్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ మురళీకృష్ణ

నంద్యాల(అర్బన్): విత్తన ప్రాసెసింగ్‌లో యజమానులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని డీఏఓ మురళీకృష్ణ తెలిపారు. నాణ్యతలో తేడాలు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలోని విజయలక్ష్మి సీడ్స్ విత్తన దుకాణంలో శనివారం ఏడీఏ రాజశేఖర్, ఏఓ ప్రసాదరావులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో విత్తన దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. డీఏఓ మాట్లాడుతూ అనుమతులు ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని దుకాణాదారులకు సూచించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, ధరలను సూచించే బోర్డులు నిర్వహించాలని చెప్పారు.

విద్యార్థులకు అందిన కోడిగుడ్లు


ఎల్లావత్తుల పాఠశాలలో కోడిగుడ్లను దించుతున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు శనివారం కోడిగుడ్లు సరఫరా అయ్యాయి. దీంతో ఆయా పాఠశాలల్లో ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు పౌష్టికాహారంగా కోడిగుడ్డును వడ్డించారు. ఎల్లావత్తుల,చందలూరు,ముత్తలూరు గ్రామాలతో పాటు మరిన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో రెండు రోజుల నుంచి విద్యార్థులకు గుడ్లు అందడం లేదని సాక్షి దినపత్రికలో శనివారం 'అందని కోడి గుడ్లు' అనే కథనం ప్రచురితం కావడంతో టెండర్ దారులు స్పందించి అన్ని పాఠశాలలకు గుడ్లు సరఫరా చేశారు.

మాతాశిశు మరణాలను అరికట్టాలి


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

నంద్యాలటౌన్: మాతా శిశు మరణాలు అరికట్టడానికి వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో.. నందికొట్కూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎర్రమఠం, టుంగుటూరు ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన మాతృ మరణాలపై ఆయా కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి గర్భిణులు, బాలింతల ఆరోగ్యస్థితిగతులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వారికి నిర్ణీత సమయంలో వైద్య సహాయం అందిస్తూ మాతా శిశు మరణాలు చోటుచేసుకోకుండా జాగ్రత్త వహించాలన్నారు. బాల్య వివాహాలు జరుకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కిల్కారి అకాడమీ సమాచారం ప్రతి ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంచాలని చెప్పారు. డీఐఓ డాక్టర్ ప్రసన్న లక్ష్మి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సహజం


ఎంపీడీఓ సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులను సన్మానిస్తున్న సచివాలయ ఉద్యోగులు

దొర్నిపాడు: ఉద్యోగరీత్యా పదవీ విరమణ అనేది సహజం అని కానీ ఉన్ననాళ్లు ప్రజలకు మంచి సేవ చేసి ఎంపీడీఓ సుబ్బారెడ్డి, క్రిష్టిపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు ఇద్దరూ సౌమ్యులని వక్తలు కొనియాడారు. ఆదివారం వారి పదవీ వివరమణ సందర్భంగా శనివారం స్థానిక ఫంక్షన్‌హాల్లో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల నాయకులు భూమా బ్రహ్మానందరెడ్డి, బత్తుల నాగేశ్వరరావు, సిద్ది సత్యం, ఏఓ సునీత, డీఎల్‌పీఓ రాంబాబు, తహసీల్దార్ నాగరాజు, డీటీ రవి, ఎంఈఓలు కరీం, రామచంద్రయ్య, డాక్టర్లు నాగేంద్ర, సునీత, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్, కట్టా రామకృష్ణుడు పాల్గొన్నారు.

కుమారుడిని సన్మానించిన తల్లిదండ్రులు..


ఎంపీడీఓ దంపతులను సన్మానిస్తున్న తల్లిదండ్రులు

స్థానిక ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ ఆదివారం పదవీ విరమణ చేయనున్న ఎంపీడీఓ సుబ్బారెడ్డిని తల్లిదండ్రులు వెంకటరెడ్డి, సుబ్బలక్ష్మమ్మ శనివారం సన్మానించారు. ఈసందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఎంతో అదృష్టం ఉంటే తప్పా తల్లిదండ్రులతో సన్మానం పొందే భాగ్యం దక్కదని కొనియాడారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డికి తల్లిదండ్రులమైనందుకు గర్వపడుతున్నామని, సంతోషంగా ఉందని వారు కన్నీటి పర్యంతమయ్యారు.

ఉపాధ్యాయుల సేవలు అమోఘం



ఉపాధ్యాయుడు ప్రజాపతిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): జ్ఞానం అనే వెలుగును ప్రసాదించే దినకరుడు గురువు అని, ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ప్రజాపతిరెడ్డి, నాగసుబ్బయ్య సేవలు మరువలేనివని డిప్యూటీ ఈఓ మహమ్మద్ బేగ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో పని చేస్తున్న తెలుగు, సోషియల్ ఉపాధ్యాయుల వలంటీర్ రిటైర్‌మెంట్ సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చలపతి, ఉపాధ్యాయులు పద్మావతి, పద్మజ, విజయ భాస్కర్, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించండి

రుద్రవరం: పంటల సాగులో తాము ఇచ్చే సూచనలపై రైతులకు అవగాహన కల్పించాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బాలరాజు, సుధాకర్,రవిగౌడ్ తెలిపారు. మండలంలోని 16 ఆర్బీకేల వీఏఏలకు శనివారం వ్యవసాయాధికారి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ,ఆర్బీకే కేంద్రం వద్ద ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం సేవలు జిల్లా అంతట విస్తరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మండలంలో వరి, మొక్కజొన్న,మినుము,పసుపు పంటలు అధికంగా సాగు చేస్తారని, ఆయా పంటల్లో వచ్చే తెగుళ్ల,పురుగులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరిని గొర్రుతో విత్తుకోవడం వల్ల ఎకరానికి రూ.1500 ఆదా చేసుకోవచ్చని చెప్పారు. త్వరలో సంస్థ సబ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, తద్వారా రైతులకు కావాల్సిన ఫర్టిలైజర్స్,పెస్టిసైడ్స్ అందుబాటులో ఉంటాయన్నారు. ఏఈఓ రాజు ఉన్నారు.

ట్యాంకులను శుభ్రం చేయించండి


ఆర్.నాగులవరం రక్షిత మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదన్ సూచించారు. మండల పరిధిలోని ఆర్.నాగులవరం,తిప్పారెడ్డిపల్లె గ్రామాల్లోని నీటి సరఫరా ట్యాంకులు, సూచిక బోర్డులు, వాటికి సంబంధించిన పైప్‌లైన్లను శనివారం పరిశీలించి పంచాయతీల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు లీకేజీలను పరిశీలించాలని చెప్పారు. నీరు కలుషితం కాకుండా చూడాలని, మూడు నెలలు నీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌పీఓ రాంబాబు

దొర్నిపాడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని డీఎల్‌పీఓ రాంబాబు సూచించారు. శనివారం మండల కేంద్రం దొర్నిపాడులో పర్యటించారు. తాగునీరు కలుషితకం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియకు సూచించారు. అలాగే తాగునీటి ట్యాంకుల వద్ద పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగర్జునను ఆదేశించారు. ప్రస్తుతం విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందని, ఓహెచ్‌ఆర్‌ఎస్‌ఆర్ ట్యాంకులను ప్రతి రెండు వారాలకు ఒకసారి క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేసి నీటిని సరఫరా చేయాలన్నారు. మలేరియా, డయేరియా, జలుబు, దగ్గు, వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యశాలల్లో ఉచితంగా రక్త పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ యామిని పాల్గొన్నారు.